సాక్షి
బాపట్ల

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024




నృసింహస్వామి సేవలో...

మంగళగిరి : పట్టణంలో వేంచేసి ఉన్న లక్ష్మీ నృసింహస్వామిని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు.



స్వామివారి నగరోత్సవం

బాపట్లఅర్బన్: శ్రీమత్ సుందరవల్లి రాజ్య లక్ష్మి సమేత క్షీర భవన్నారాయణస్వామి సూర్యప్రభ వాహనంపై భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 517.30 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ పర్చూరు సమన్వయకర్తగా యడం బాలాజీ



సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన యడం బాలాజీ

సాక్షి ప్రతినిధి, బాపట్ల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గం సమన్వయకర్తగా యడం బాలాజీని నియమించారు. పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. చీరాల పట్టణానికి చెందిన యడం బాలాజీ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. చీరాల నియోజకవర్గం నుంచి సమన్వయకర్తగా పనిచేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. బాలాజీని పర్చూరు సమన్వయకర్తగా నియమించారు. శుక్రవారం సాయంత్రం బాలాజీ తన అనుచరులతో కలిసి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు సంబంధించి పలువురిని పలు పదవుల్లో నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈమేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర లీగల్ విభాగం అధికార ప్రతినిధిగా సయ్యద్ బాబు షేక్, ప్రధాన కార్యదర్శిగా పోలూరి వెంకటరెడ్డి, కార్యదర్శిగా కర్రి అబ్రహం లింకన్, సహాయ కార్యదర్శిగా జె.ఎలిజిబెత్‌రాణిలను నియమించారు. రాష్ట్ర ఎస్టీ విభాగం అధికార ప్రతినిధిగా వై.వెంకటసుబ్బయ్య, కార్యదర్శిగా కట్టా బుల్లయ్య, సహాయ కార్యదర్శిగా ఐ.గాంధీనాయక్‌లను నియమిస్తూ ఆదేశాలు వెలువరించారు. పార్టీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా మెట్టు వెంకటప్పారెడ్డి, కార్యదర్శులుగా బుసి సుబ్బారావు, ఆనం నరేంద్రరెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సీఆర్డీఏ పరిధిలో రూ.83.75 కోట్లతో వసతులు

అదనపు కమిషనర్ కట్టా సింహాచలం



మంగళగిరి: సీఆర్డీఏ పరిధిలోని పలు గ్రామాల్లో రూ.83.75 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు అదనపు కమిషనర్ కట్టా సింహాచలం తెలిపారు. రాజధాని పరిధిలోని వెంకటపాలెం, నవులూరు నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ఈ–హెల్త్ సెంటర్‌లు, పాఠశాలలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో 14 ప్రభుత్వ పాఠశాలలు, 17 అంగన్‌వాడీ కేంద్రాలు, 16 ఈ–హెల్త్ సెంటర్లతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా శ్మశానవాటికల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. సీఆర్డీఏ పరిధిలోని పనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఫ్రెంచ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా కొనసాగుతున్న నిర్మాణాలను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ పీఎల్ఎన్ కార్తీక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో 1,19,963 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,05,771 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,19,963 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 80,343 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను తెలిపారు.

చీలికలు పీలికలుగా చీరాల టీడీపీ



చీరాల సీటు తనకే ఇస్తున్నారంటూ చీరాలలో సమావేశం నిర్వహించిన మాజీ జెడ్పీటీసీ చంద్రమౌళి (ఫైల్)

- ఇన్‌చార్జి ఉన్నా తమ్ముళ్ల తలో దారి
- మంగళగిరి లోకేష్ సీటుతో చీరాలలో పెరుగుతున్న విభేదాలు
- ఎవరికి వారు ప్రత్యేక సమావేశాలు, కార్యక్రమాలు

చీరాల: నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి చీలికలు, పేలికలుగా మారింది. ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా తెలుగు తమ్ముళ్లు ప్రత్యేక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఓ వర్గానికి పార్లమెంట్ అధ్యక్షుడిగా ఉన్న ఏలూరి సాంబశివరావు పరోక్షంగా మద్దతు తెలపడంతో విభేదాలు కాస్త వేరు కుంపట్లకు దారితీసింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి ఎంఎం కొండయ్య రెండేళ్లు అవుతుంది. ఆయన పార్టీ కార్యక్రమాలు ఇన్‌చార్జి హోదాలో చేస్తున్నప్పటికీ పోటీ కార్యక్రమాలు, కుల సమావేశాలు చేస్తుండడంతో తాను పార్టీ కోసం చాలా ఖర్చు పెట్టి పార్టీని నిలబెడుతున్నానని, కాని అధినేతతో పాటు పార్టీ అధిష్టానం చీరాలలో ఎటూ తేల్చకుండా వర్గ విభేదాలను ఫుల్‌స్టాప్ పెట్టకపోడంతో ఆయన పార్టీ నాయకుల వద్ద అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సొంత సామాజిక వర్గం నుంచి..

ఇదిలా ఉంటే తెలుగుదేశం పార్టీకి చెందిన సొంత సామాజికవర్గం రంగంలోకి దిగింది. చీరాల సీటు కారంచేడుకు చెందిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఓ ఎన్ఆర్ఐకు ఇచ్చేందుకు పావులు కదుపుతున్నారు. దీనిలో అసలు పార్టీ క్యాడర్ దూరమై సతమతమవుతుంటే పోటీ కార్యక్రమాలు టీడీపీని అతలాకుతలం చేస్తున్నాయి. అలానే చీరాలలో టీడీపీ సీటు ఆశిస్తున్న ఆశావహులకు పొన్నూరుకు చెందిన ఓ వ్యక్తి లోకేష్‌కు అంతరంగికుడినంటూ లోకేష్ ద్వారా సీటు ఇప్పిస్తానని చీరాలలోని ఆశావహుల వద్ద కోటి రూపాయల వరకు వసూలు చేశారు. ఆశపడిన ఆశావహులు అతడికి ఎక్కువ మొత్తంలో నగదు ముట్టజెప్పారు. పర్చూరు నియోజకవర్గంలోని ఇంకొల్లులో జరిగే 'రా కదిలిరా..' కార్యక్రమంలో చీరాల సీటుపై చర్చ జరిగే అవకాశం ఉంది.

చీరాల సీటుపై లోకేష్ చిచ్చు..

చీరాల, మంగళగిరి సీట్లుకు లింకు కాస్త చీరాలలో టీడీపీలో కులాల కుమ్ములాట్లకు దారితీసింది. లోకేష్ మంగళగిరి నుంచి పోటీ చేస్తుండడంతో అక్కడ చేనేతలు అధికంగా ఉండడంతో అక్కడ ఎలాగైనా గట్టెక్కేందుకు లోకేష్ చీరాల సీటును ఎరగా వేస్తున్నారు. తాను మంగళగిరిలో పోటీ చేస్తుండడంతో చేనేతలలోనే దేవాంగులకు గాని, పద్మశాలీయులకు గాని ఇచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు లోకేష్‌ను కలుస్తున్న చేనేత నాయకులకు భరోసా ఇస్తున్నారు. పార్టీ అధినేత మాత్రం ప్రస్తుతం బీసీలకు ఇవ్వాలని అనుకుంటుండగా చీరాలలో చేనేతలకు సీటు ఇస్తే తాను మంగళగిరిలో బయటపడతానని లోకేష్ అంటున్నట్లుగా సమాచారం. దీంతో కొంత కాలంగా చీరాలలో చేనేత వర్గానికి చెందిన డాక్టర్ సజ్జా హేమలత, మునగపాటి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ గుద్దంటి చంద్రమౌళి, మంగళగిరి ప్రాంతానికి చెందిన కాండ్రు శ్రీనివాసరావు, చాత్రాసి రాజేష్, చీరాలలో ఇప్పటికే తమ సామాజిక వర్గాలతో సమావేశాలు నిర్వహించారు. లోకేష్‌ను తరచూ కలుస్తున్నారు. సీటు నాకంటే నా అంటూ ప్రచారం కూడా మొదలుపెట్టారు. ఇదిలా ఉంటే డీఎస్పీగా పనిచేస్తూ ప్రస్తుతం సెలవులో ఉన్న యాదవ సామాజిక వర్గానికి చెందిన కొమ్మనబోయిన నాగేశ్వరరావు గత రెండు నెలలుగా చీరాల నియోజకవర్గంలో తిరుగుతూ యాదవ గ్రామాల్లో పర్యటిస్తూ తానే పోటీ చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. గత కొద్ది నెలలుగా ఈ తతంగం జరుగుతున్నప్పటికీ పార్టీ అధిష్టానం చీరాల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఇన్‌చార్జిగా ఉన్న ఎంఎం కొండయ్య కూడా పూర్తి అసహనంగా ఉంటున్నారు. ఇక లాభం లేదని పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు.

నాయకులు మారినా నష్టం లేదు..



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి: నాయకులు పార్టీ మారినంత మాత్రాన పార్టీకి నష్టం జరగదని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి సస్పెన్షన్‌కు గురైన బాచిన కృష్ణచైతన్య, ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య పార్టీ మారిన విషయమై పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. హనిమిరెడ్డి మాట్లాడుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరికైనా వేటు తప్పదని హెచ్చరించారు. పార్టీని నాయకులు వీడినా కార్యకర్తలు, ఓటర్లు కనిపెట్టుకుని ఉన్నారని గుర్తు చేశారు. చైతన్య పార్టీని వీడినా ప్రజలు ఆయనను చూడరని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల పాలననే చూస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించాడన్నారు. పేదలు మూడు పూటలా భోజనం పెట్టారని చెప్పారు. అద్దంకి నియోజకవర్గ ప్రజలు పార్టీతోపాటు, సమన్వయకర్తగా ఉన్న నన్ను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. ఎంతమంది ఏకమైనా అద్దంకిలో హనిమిరెడ్డి విజయాన్ని ఆపలేరని చెప్పారు. బాపట్ల జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు మాట్లాడుతూ ఎవరు పోయినా పార్టీకి నష్టం లేదన్నారు. నియోజకవర్గంలో పార్టీకి, సమన్వయకర్తకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రజల దీవెనలే హనిమిరెడ్డికి విజయం చేకూర్చి పెడతాయన్నారు. పదవులు అనుభవించి పార్టీ మారి పార్టీకి తీరని నష్టం చేశారని, మొదటి నుంచి మేము అధిష్టానానికి చెప్తూనే ఉన్నామన్నామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ జజ్జర ఈశ్వరమ్మ ఆనందరావు, శింగరకొండ నరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ జువ్వి రాము మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు పనిచేసి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, కొల్లా భువనేశ్వరి, జాగర్లమూడి యల్లమందరావు, కోట శ్రీనివాసకుమార్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు

వైభవంగా రథ సప్తమి



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలోని సూర్యదేవాలయంలో రథ సప్తమి సందర్భంగా సూర్య భగవానునికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తమి ధనిష్ట నక్షత్రంలో సూర్య భగవానుడికి అర్చకులు ప్రత్యేకంగా పంచామృతాలతో మహాన్యా స పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి, స్వామి వారికి సహస్ర నామ పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వేమూరి గోపినాథశర్మ ఆధ్వర్యంలో భక్తు లకు తీర్థప్రసాదాలు అందజేశారు.

'పులిచింతల' రోడ్డుకు నిధులు

- రూ.3.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- దశాబ్దాల కల సాకారం



పులిచింతల ప్రాజెక్టుకు వెళ్లే మట్టి రోడ్డు

అచ్చంపేట: మాదిపాడు నుంచి రెండు గిరిజన తండాలను కలుపుతూ పులిచింతల ప్రాజెక్టు ఘాట్‌రోడ్డు వరకు అంటే ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు వేసేందుకు రూ.3.50 కోట్లు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రాంత ప్రజల కష్టాలను చూసి చలించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రోసూరు వచ్చిన సందర్భంలో సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. సీఎం జగన్ చొరవ, ఎమ్మెల్యే శంకరరావు కృషి ఫలితంగా జిల్లా కలెక్టరు మంజూరు చేసిన రోడ్డు రెండు గిరిజన తండాల ప్రజలకే కాకుండా పులిచింతల ప్రాజెక్టు సందర్శనకు వెళ్లే వేలమందికి ఊరటనిచ్చే విషయం. మాదిపాడు పంచాయతీ పరిధిలోని కంచుబోడుతండా, జడపల్లిమోటు తండాలను కలుపుతూ పులిచింతల ఘాట్ రోడ్డు వరకు శాశ్వత రోడ్డు లేకపోవడం వల్ల గుంతల రోడ్డుపై ప్రయాణం చేయలేక ఈ ప్రాంతవాసులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే కనీసం ద్విచక్ర వాహనం వెళ్లేందుకు కూడా అవకాశం ఉండేది కాదు. అత్యవసర పరిస్థితులలో వైద్య సేవలు కూడా సకాలంలో లభించేవి కావు. పులిచింతల నిండి మిగులు నీటి వల్ల ముంపునకు గురైతే గిరిజన తండాలు జలదిగ్బంధంలో కూరుకుపోయేవి. సహాయక చర్యలకు కూడా ఏమాత్రం అవకాశాలు లేని పరిస్థితులెన్నో. ఈ ప్రాంతానికి నాలుగుసార్లు ప్రాతినిధ్యం వహించిన మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న కొమ్మాలపాటి శ్రీధర్ సాధించలేని ఈ ఘనతను ప్రస్తుత ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సాధించడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చాలా సంతోషం



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృషితో ఇన్నాళ్లకు ఈ రోడ్డుకు మోక్షం కలగడం చాలా సంతోషకరం. రోడ్డు కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నాం. గత పాలకులకు, అధికారులకు చాలాసార్లు విన్నవించాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు.

– యాంపొంగు ఏసు, లారీ డ్రైవర్, మాదిపాడు.

ఇన్నాళ్ల మా నిరీక్షణకు తెరపడింది



దశాబ్దాల మా నిరీక్షణకు ఇన్ని రోజులకు తెరపడింది. వెంటనే పనులు చేపడితే రోడ్డు ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా గిరిజన తండాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఎమ్మెల్యేకు, సీఎం జగన్‌కు మా కృతజ్ఞతలు.

– దేవరశెట్టి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నాయకుడు, మాదిపాడు.

నేను అందరివాడిని..

- నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్
- పల్నాడు రోడ్డులో నూతన ఎంపీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ అనిల్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: నేను అందరివాడిని, అందరికి అందుబాటులో ఉంటానని నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త, నెల్లూరు టౌన్ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం పల్నాడు రోడ్డులో ఏర్పాటుచేసిన లోక్‌సభ నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. తనను ఒక మంచి ప్రాంతానికి పంపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని మంత్రి అంబటి రాంబాబు, ఆరుగురు శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, చిలకలూరిపేట సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు, ప్రజలు అందరూ కలిసికట్టుగా పెద్దఎత్తున తనకు స్వాగతం పలికి ఆశీస్సులు అందించి విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేలు అందరితో తనకు పదేళ్లుగా పరిచయం ఉందన్నారు.

అందరూ తనకు పెద్దలేనన్నారు. వారందరినీ కలుపుకొని పోతామని, సీఎం జగన్ ఆశీస్సులు, ఆయన అమలుచేస్తున్న పథకాలతో గెలుస్తామనే నమ్మకం తమకు ఉందన్నారు. తమకు కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఉందన్నారు. అవకాశం ఉన్నంతవరకు ప్రతి గ్రామంలో ఎక్కువ మందిని కలిసేందుకు పర్యటిస్తామన్నారు. తనకు ఆశీస్సులు, దీవెనలు ఇవ్వాలని ప్రజలను కోరారు. నిజాయతీ అనేది చాలా ముఖ్యమని, అది తమ నాయకుడితోపాటు తామందరికీ ఉందన్నారు. ప్రజలు తమకు ఓట్లు వేస్తున్నారంటే అది సీఎం జగన్‌ను చూసి మాత్రమేనన్నారు. వారందరినీ గౌరవించాల్సిన బాధ్యత తమకు ఉందన్నారు. ఆయనను విడిచిపెట్టే పని ఎప్పుడూ చేయనని, ఆయన విధేయుడిగా ఉంటానని స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా నుంచి ఒక నమ్మకంతో ఈ ప్రాంతానికి మీ బిడ్డగా వచ్చిన తనకు ఆశీస్సులు ఇవ్వాలని కోరారు. త్వరలో ప్రతి నియోజకవర్గంలో తిరిగేందుకు స్థానిక ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో ఒక ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించి పర్యటిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ అనిల్ అన్న రాక క్యాడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపిందన్నారు. ఆరంభం అదిరిందని, సుమారు 25 నుంచి 30వేల మంది ప్రజలు హాజరై స్వాగతం పలికారన్నారు. ఇదే ఉత్సాహంతో వచ్చే ఎన్నికల్లో ఏడుకు ఏడు నియోజకవర్గాలు, ఎంపీ స్థానం విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పెద్దమక్కెనలో రూ.2.51 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



పెద్దమక్కెనలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలో శుక్రవారం రాత్రి రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.27 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, మనబడి నాడు–నేడు ఫేజ్–1 క్రింద ఎంపీపీ పాఠశాల(ఎల్ఈ) రూ.4.50 లక్షలతో నిర్మించిన ప్రహరీని ఆయన ప్రారంభించారు. ఇంటింటికి తాగు నీటిని అందించేందుకు రూ.1.80 కోట్లతో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ నేరుగా గ్రామంలోనే పరిపాలన అందించడం జరుగుతుందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సచివాలయాల ద్వారా ప్రజలకు పరిపాలన అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రతి పైసాను పారదర్శకంగా అవినీతి రహితంగా ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. నాడు చంద్రబాబు హయాంలో సంక్షేమ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీ సభ్యలను ప్రసన్నం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడేదన్నారు. నేడు ప్రతి సంక్షేమ పథకం కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయన్నారు. పార్టీలు ఏవైనప్పటికీ అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాన్ని నేరుగా ఇంటికే చేరుస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చో బెట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాల కన్నీళ్లు తుడిచే నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని, అందుకే ఏ రాష్ట్రంలో లేని విధంగా 32 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సభలో నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి మాట్లాడారు. ముందుగా ఆయా భవనాలను మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎలవర్తి పాటి షేక్ జై బూన్‌బీ, జెడ్పీటీసీ సభ్యురాలు సంకటి నాగేశ్వరమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, ధూళిపాళ్ల దిఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివనారాయణ, ఎంపీటీసీ యాంపాటి విజయలక్ష్మి, నాయకులు వద్దుల వేమారెడ్డి, వద్దుల రామకృష్ణారెడ్డి, సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి, వద్దుల వెంకటప్పారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ దుర్మరణం

● ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరోలారీ ● మృతుడు తెలంగాణవాసి


మృతుడు రాజు

నకరికల్లు: ఆగి ఉన్న లారీని మరొకలారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని అడ్డరోడ్డు గ్రామం వద్ద శుక్రవారం తెల్లవారుఝామున జరిగింది. ఘటనకు సంబంధించి నకరికల్లు ఎస్ఐ పి.రాంబాబు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చీమలకొండూరు గ్రామానికి చెందిన మద్రిపల్లి రాజు (28) చెన్నై నుంచి హైదరాబాద్‌కు లారీలో బయలుదేరాడు. మార్గంమధ్యలో చల్లగుండ్ల అడ్డరోడ్డు వద్దకు వచ్చేసరికి ఎలాంటి సిగ్నల్స్ వేయకుండా లారీ ఆగి ఉండడంతో ప్రమాదవశాత్తు ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ రాజుకు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటలోని ఏరియా వైద్యశాలకు సమాచారం అందించారు. బంధువులకు సమాచారం అందించారు. రాజుకు పక్కన క్లీనర్ జిల్లపల్లి సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రస్తుత యుగంలో తులనాత్మక చట్టం ప్రముఖ పాత్ర

● సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రవీంద్ర భట్
● వీఐటీ- ఏపీ వర్శిటీలో కంపేరిటివ్ లా పై అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న జస్టిస్ రవీంద్ర భట్

ఐనవోలు(తాడికొండ): ప్రస్తుత యుగంలో కంపేరిటివ్ లా (తులనాత్మక చట్టం) ప్రముఖ పాత్ర పోషిస్తోందని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూరి జస్టిస్ రవీంద్ర భట్ అన్నారు. తుళ్ళూరు మండలం ఐనవోలు వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయంలో స్కూల్ ఆఫ్ లా - బర్మింగ్ హోమ్ యూనివర్శిటీ, రామయ్య స్కూల్ ఆఫ్ లా సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కంపేరిటివ్ లా ఎక్స్ ప్లోరింగ్ కన్వర్జన్స్, డైవర్షన్, లిమినల్ స్పేసెస్ అనే మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ దేశాల న్యాయ వ్యవస్థల మధ్య వ్యత్యాసాలు, సారూప్యతలను అధ్యయనం చేసే తులనాత్మక చట్టంపై ఆయన విద్యార్థులకు వివరించారు. వీఐటీ ఏపీ విశ్వ విద్యాలయ వీసీ డాక్టర్ కోటారెడ్డి మాట్లాడుతూ వర్శిటీ సాధిస్తున్న అనేక విజయాలను వివరించి విద్యార్థులను న్యాయ రంగంలో కూడా రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలు అందిస్తున్నామన్నారు. వాటిని అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ తమ వర్శిటీలో అందిస్తున్న ప్రఖ్యాత ఇంజినీరింగ్ ప్రోగ్రామ్‌లతో పాటు నాన్ ఇంజినీరింగ్ కోర్సుల వివరాలు తెలియజేసి క్యాంప్‌లో విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలను వివరించారు. వర్శిటీ స్కూల్ ఆఫ్ లా డీన్ డాక్టర్ బెనర్జీ చక్కా మాట్లాడుతూ మేథోపరమైన సంభాషణను పెంపొందించడం, విద్యాపరమైన మార్పిడిని పోత్సహించడం, పరిశోధన, తులనాత్మక న్యాయ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రామయ్య కాలేజ్ ఆఫ్ లా, బెంగళూరు ప్రిన్సిపల్ ఉమా మహేష్ సత్యన్నారాయణ, వీఐటీ చైన్నై ప్రొఫెసర్ గాంధీ, బర్మింగ్ హోమ్ వర్శిటీ గ్లోబల్ ఎంగేజ్ మెంట్స్ ప్రొఫెసర్, డైరెక్టర్ డాక్టర్ అలెగ్జాండ్రా కావోస్కి తదితరులు ప్రసంగించారు. సదస్సులో భారతదేశం, విదేశాల్లోని ప్రసిద్ధ న్యాయ పాఠశాలల్లోని న్యాయ విద్యార్థుల నుంచి 120 కంటే ఎక్కువ పరిశోధన పత్రాలు స్వీకరించినట్లు తెలిపారు. అందులో మూడు రోజుల చర్చల్లో 80 పరిశోధన పత్రాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఏపీ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం తప్పనిసరి

ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకులు పి.స్రవంతి


డీఈఓ నారాయణరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్రవంతి

బాపట్ల అర్బన్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకుడు పి.స్రవంతి పేర్కొన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పర్యావరణ విద్య కార్యక్రమం అమలు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలోని విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. స్థానిక హోలీ క్రాస్, లిటిల్ ఏంజిల్స్, జెమ్స్ హైస్కూల్‌లను సందర్శించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా విద్యా శాఖాధికారి కె.నారాయణరావు, ఎంఈఓలు నిరంజన్, ప్రసాద్, గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త పవని భానుచంద్ర మూర్తి, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మేలు జాతి దూడలతో ఆదాయం

ఒంగోలు పశుక్షేత్రం ఉప సంచాలకుడు డాక్టర్ రమేష్‌బాబు


పశుపోషకులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న అధికారులు

పర్చూరు(చినగంజాం): మేలు జాతి దూడలను సరైన పద్ధతుల్లో పెంచితే రైతులకు మంచి లాభాలు చేకూర్చి పెడతాయని ఒంగోలు పశుక్షేత్రం ఉప సంచాలకుడు డాక్టర్ ఏ రమేష్‌బాబు అన్నారు. మండలంలోని చెరుకూరులో శుక్రవారం కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. డీఎల్‌డీఏ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎస్‌కే కాలేషా, రమేష్ బాబు హాజరయ్యారు. డాక్టర్ కాలేషా మాట్లాడుతూ పడ్డల దూడల ఉత్పత్తి పథకం ద్వారా మేలు జాతి ఆడ దూడలు పొందవచ్చన్నారు. రైతులు రూ.500 చెల్లిస్తే 2 ఎద సూదులు చేస్తారని, ఒక వేళ పశువు చూడిది కాకుంటే డబ్బు వెనక్కి తిరిగి ఇస్తారన్నారు. ఒక వేళ మగ దూడ పుడితే రూ.250 రైతులకు చెల్లిస్తారని, ఈపథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బీ మాధవి, అన్నంబొట్లవారిపాలెం పశువైద్యశాల పశువైద్యాధికారి కే అరుణ, డీఎల్‌డీఏ పశువైద్యులు డాక్టర్ కృపారావు, చెరుకూరు వీహెచ్ఏ కుమారి, గోపాలమిత్రలు కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు పశుపోషకులకు బహుమతులు అందజేశారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా సత్తిబాబు

బాపట్ల: జిల్లా రెవెన్యూ అధికారిగా సిహెచ్.సత్తిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డీఆర్ఓ గా పని చేశారు. కాకినాడ జిల్లాలో జిల్లా సంయుక్త కలెక్టర్-2గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం కోనసీమలో డీఆర్ఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తదుపరి శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కృష్ణకాంత్, కలెక్టరేట్ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారిగా వెంకట సుధాకర్

బాపట్ల సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారిగా ఎం.వెంకట సుధాకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎం.వెంకట సుధాకర్ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో భూ సేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్‌గా పని చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకట సుధాకర్ సాధారణ బదిలీపై బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీగా రవి



చీరాల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర న్యాయ విభాగ కమిటీలో జాయింట్ సెక్రటరీగా చీరాలకు చెందిన న్యాయవాది కర్నేటి రవికుమార్ నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం 69 మందితో న్యాయ విభాగ కమిటీని గురువారం విడుదల చేసింది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ఓదార్పు యాత్ర నుంచి చీరాల నియోజకవర్గంలో ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. అలానే చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు.

చెట్టుకు ఉరేసుకొని యువకుడు మృతి


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జే.పంగులూరు: భార్యాభర్తల మధ్య చోటుచేసుకున్న వివాదంతో ఉరేసుకొని మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నూజిళ్లపల్లి గ్రామం పమిడిపాడి పాడు వైపు వెళ్లే రోడ్డు సమీప పొలాల్లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. బోయకర్నం మద్దిలేటి (40) కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. మృతుడు గత 24 రోజుల క్రితం కర్నూలు జిల్లా సీ బెళగల్ మండలం కంబదహాల్ గ్రామం నుంచి 20 కుటుంబాలతో మిరప కోతల కోసం వచ్చారు. శుక్రవారం భార్యాభర్తలకు వాదన జరిగింది. అది మనసులో పెట్టుకొని మృతుడు సమీపంలో చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు.

మిషీన్ లెర్నింగ్ టెక్నాలజీ పుస్తకావిష్కరణ



తాడేపల్లిరూరల్: ప్రపంచ వ్యాప్తంగా పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయంలోని పరిశోధకుల పరిశోధన పత్రాలను సేకరించి 8 అధ్యాయాలతో కూడిన పుస్తకాన్ని శుక్రవారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని పలు యూనివర్శిటీలకు చెందిన పరిశోధన అధ్యాపకులతో పాటు చైనా, పెరు, దక్షిణ కొరియా, వియాత్నం వంటి దేశాల్లోని ఆయా విశ్వవిద్యాలయాల్లో ఉన్న పరిశోధకులు మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీపై విస్తృత స్థాయిలో పరిశోధనలు చేశారని తెలిపారు. ఆయా పరిశోధన పత్రాలు ఒక చోటుకు చేర్చి పుస్తక రూపంలో రూపొందించినట్లు వివరించారు. ఇందుకు కేఎల్‌యూలోని సీఎస్ఈ అధ్యాపకులు డాక్టర్ కొల్లా భానుప్రకాష్, వియత్నాంకు చెందిన టెన్ అన్ ట్రాన్, సింగపూర్‌కు చెందిన యువాన్ సీకే టాన్, ఇండియాకు చెందిన సుబ్రతా చౌదరీ ఎడిటర్‌లుగా వ్యవహరించినట్లు తెలిపారు. డాక్టర్ కొల్లా భానుప్రకాష్ మాట్లాడుతూ 8 అధ్యాయాలు, 158 పేజీలు కలిగిన ఈ పుస్తకాన్ని రూపొందించడానికి తమకు 9 నెలల సమయం పట్టిందన్నారు. బీటెక్ మెరైన్ ఇంజినీరింగ్, కంట్రోల్ సిస్టం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, లైఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. బుచ్చినాయుడు పాల్గొన్నారు.

ఇంటింటి ఆరోగ్య సర్వే

గుంటూరు మెడికల్: అతిసార నియంత్రణలో భాగంగా రౌండ్ ది క్లాక్ ప్రాతిపదికన నిరంతర వైద్య సేవల్లో భాగంగా ఏడు వైద్య శిబిరాలు కొనసాగిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారదా కాలనీలో మూడు, ఇందిరా ప్రియదర్శి కాలనీలో రెండు, లాంచెస్టర్ రోడ్డు పరిధిలో రెండు వైద్య శిబిరాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించినట్లు తెలిపారు. 35 వైద్య బృందాలతో ఇంటింటా సర్వే నిర్వహించారన్నారు. సర్వేలో 11,410 గృహాలు సందర్శించి, 3,434 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 56 జింక్ మాత్రలు పంపిణీ చేసినటులవివరించారు. వ్యాధికి కారణాలు, లక్షణాలు, చికిత్స, నివారణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అవగాహన కరపత్రాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సర్వేలో 12 మంది అనుమానిత అతిసార బాధితులను గుర్తించి, అందులో నలుగురికి గురికి ఇంటి వద్దనే చికిత్స అందించినట్లు వెల్లడించారు. మిగిలిన 8 మందిలో నలుగురికి ఐపీడీ కాలనీలోని పట్టణ ఆరోగ్యకేంద్రంలో, ఇద్దరికి శారదా కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో, ఇద్దరికి లాంచేస్టర్ రోడ్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో చికిత్స అందించినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను ప్రోగ్రాం అధికారులు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పర్యవేక్షించారని కోరారు. వైద్య సహాయం కావాల్సిన వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లుకు ఫోన్ చేసి 8341396104, 7207595104 సహాయం పొందాలని డాక్టర్ విజయలక్ష్మి సూచించారు.

విజయకీలాద్రిపై రథసప్తమి వేడుకలు


వేంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి


పెరుమాళ్లకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శుక్రవారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ విజయకీలాద్రి దివ్యక్షేత్ర 7వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మరియు రథసప్తమి పురస్కరించుకుని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పరిపూర్ణ మంగళా శాసనములతో ప్రత్యక్ష పర్యవేక్షలో ఉదయం సామూహిక ఆదిత్య హృదయస్తోత్ర పారాయణ నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విజయకీలాద్రి ఆలయ పెరుమాళ్ల అందరికీ అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం గావించామని తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం, విజయకీలాద్రి వాసుడైన వెంకటేశ్వరస్వామి వారిని సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారని వివరించారు. సాయంత్రం వెంకటేశ్వర స్వామి వారు గరుడ వాహనంపై విజయకీలాద్రి గిరి పరిక్రమణ జరిగిందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని పురాణం వెంకటాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు, విజయకీలాద్రి దివ్యక్షేత్ర అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.